# పచ్చని ప్రేమ

-యం.ఎల్.సూర్యకాంతం

తోటముందు కారు దిగిన ఉష మెల్లగా, నిస్సత్తువగా గేటు తీసుకుని తోటలోకి వెళ్తుంటే వాచ్‌మెన్ ఎదురొచ్చి "నమస్కారమమ్మా" అన్నాడు. అదేమీ గమనించకుండా ముందుకు సాగిపోయింది ఉష. తోట మధ్యలో ఉన్న ఆ గెస్ట్‌హౌస్ వైపు అడుగులేస్తుంటే దారికి ఇరువైపులా ఉన్న పూలమొక్కలు తడిసిన అందాలతో స్వాగతం పలుకుతున్నాయి. చింటూ బంటూలు తోకలు ఊపుకుంటూ వచ్చి ముందరి కాళ్లు పైకెత్తి సంతోషంగా విన్యాసాలు చేస్తున్నాయి. వాటి సంతోషం చూసిన ఆమె మనసు ప్రేమతో నిండిపోయింది. వాటి తల నిమిరి హేండ్‌బాగ్‌లోంచి బిస్కెట్స్ అందించి మరోప్రక్కనున్న పావురాల కుటీరాలవైపు నడిచింది.

అక్కడే ఒక బండరాయిపై చతికిలబడి డబ్బాలోని గిరిజలు తీసి వెదజల్లింది. బిల బిలమంటూ చుట్టూ వాలిన పావురాలను చూస్తూ కూర్చుండిపోయింది. హృదయ భారాన్ని దించుకోవాలని ఇక్కడికొస్తే మరింత పెరుగుతూ గుండెను నొక్కినట్లుగా అనిపిస్తోంది.

చుట్టూ ఉన్న కొబ్బరిచెట్లు, బత్తాయి, నారింజ, సపోటా, పనస చెట్లు నిమ్మతోట కళకళలాడుతున్నాయి. నిమ్మపూల సువాసన గమ్మత్తుగా, మత్తుగా ఉంది.

ఉదయం తొమ్మిదిగంటలైనా ఇంకా మంచు పొరలతో లేలేత కిరణాలతో అలరారుతున్న ఆ దృశ్యం అద్భుతంగా ఉంది. ఇక ఈ తోట, ఈ సుందర దృశ్యం కనబడదనుకుంటే ఉషకి దుఃఖం ముంచుకొస్తోంది. ఇరవై ఎకరాల విశాలమైన ఆ తోట, ఆ బంగ్లా అంటే ఆమెకెంతో ఇష్టం. పెళ్లయిన కొత్తల్లో భర్తతో కలసి ఇక్కడ గడిపిన రోజులన్నీ జ్ఞాపకాల పుటల్లో పదిలంగా దాచుకుంది. కురిసే మంచునీ, ఎగిరే పిట్టలు, విరిసే పూలనీ చూస్తే చాలు తన మనసు, శరీరం ఉల్లాసంగా, ఆనందంగా అయిపోతుంది ఎందుకనో. ఓ ఖరీదైన నగా, వేలు ఖరీదు చేసే పట్టుచీరా ఇవ్వని ఆనందం ఈ ప్రకృతి తనకు ఇస్తుంది. భర్త ప్రకాష్‌తో కలిసి తనవి, భర్తవి పుట్టినరోజులు, పెళ్లిరోజులు ఇక్కడే జరుపుకున్నారు.

ఆ అనుభూతులన్నీ ఇక జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి అనుకుంటే మరింత బాధగా ఉంది ఉషకి.ఆమె బాధకి కారణం ఆమె మామగారే. ఆ ఇరవై ఎకరాల తోటని ప్లాట్స్‌గా మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనీ, మరిన్ని కోట్లు సంపాదించాలని ఆయన ఆలోచన. ఈ మాట ఆమె చెవిన పడిన దగ్గర్నుంచీ ఒకటే వేదన. ఈ విషయం భర్తతో కూడా చెప్పి చూసింది.

"నీదంతా సెంటిమెంట్ ఉషా...అయినా డాడీ ఇష్టం. ఆ పొలం నా చిన్నప్పుడు చాలా చౌకగా కొని తోట వేయించారుట. ఇప్పుడు స్థలం అమ్మితే చాలా డబ్బు వస్తుంది. ఏం చేద్దాం చెప్పు. అంతా ఆయన ఇష్టం"

భర్త తండ్రి మాటకు ఎదురు చెప్పలేడని తనకు తెల్సు. అందుకే సూటిగా మామగారినే అడగాలని నిశ్చయించుకుంది. ఒకసారి బంగ్లా చుట్టూ తిరిగి ఇంటికి బయలుదేరింది.

★★★

రాత్రి భోజనాల సమయంలో ఆయన దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావించింది.

"మామయ్యా! మన తోటను ప్లాట్స్‌గా మార్చేస్తున్నారని తెల్సింది..." భయం భయంగా అడిగింది. ఆయన ఆమెవైపు వింతగా చూసారు. ఎందుకంటే ఆమె ఎప్పుడూ తమ వ్యాపారాల గురించి పట్టించుకోలేదు.

"మీ వ్యాపారాల గురించి వివరణ కోసం కాదు మామయ్యా... ఆ తోటలు బాగున్నాయి. ఆదాయం కూడా వస్తుంది. మరి ప్లాట్స్‌గా మార్చి ఎందుకు అమ్మాలనుకుంటున్నారు?..."

"అదా సంగతి... ఆ తోటలు చూడడానికి బాగానే వున్నా అంత ఆదాయం రావడంలేదమ్మా. అదే ప్లాట్లుగా మారిస్తే ఆ తోటల మీద పదిహేను సంవత్సరాలకు వచ్చే ఆదాయం ఒక్కసారి వస్తుందమ్మా. అది మరో వ్యాపారంలో పెడితే మరింత లాభాలు వస్తాయి" అన్నారాయన.

"ఎక్కువ ఆదాయం వస్తుందికదాని అంత మంచి తోటను నరికేస్తారా మామయ్యా. నీటి వసతితో మంచికాపుతో వున్న తోటను పాడు చేయకండి మామయ్యా" అంది వేడుకోలుగా.

"అది కాదమ్మా. ఆ ప్రక్కనే ఏర్‌పోర్ట్ ఉంది కదా. హైవేని కలిపే ఓవర్‌బ్రిడ్జిని కూడా ప్లాన్ చేస్తున్నారు. మరో ప్రక్క యూనివర్శిటీ... అదంతా డెవలప్ అయిపోతోందమ్మా. ఇప్పటికే ఆ చుట్టుప్రక్కల తోటలు, పొలాలు అమ్ముడయిపోయాయి కూడా" అన్నారాయన.

"డెవలప్‌మెంట్ అంటే పచ్చని పొలాలు తోటలు నాశనం చేసి అంతస్థుల బిల్డింగ్‌లు, ఫ్యాక్టరీలు కట్టడమేనా మామయ్యా? ఈ తోటలన్నీ ఇలా మారిపోతే ముందు తరాలకి తినడానికి పండు అంటూ ఉంటుందంటారా?" అంది ఆవేదనగా. కోడలి మాటలకు ఆయన చిన్నగా నవ్వుతూ "ముందు తరాల సంగతి మనకెందుకమ్మా. మన తరాలకేమి లోటు వుండదులే. అయినా ఈ విషయాలన్నీ నీకెందుకమ్మా? హాయిగా ప్రశాంతంగా ఉండు. వందల ఎకరాల్లో ఫ్యాక్టరీలు, ఇళ్లు వెలుస్తుంటే మన ఇరవై ఎకరాలు ఒక లెక్కా? సరే...సరే ఇంతకీ ఆ తోటలు అమ్మడం నీకిష్టం లేదంటావ్ అంతేగా?"

"అవును మామయ్యా... ఆ పూల మొక్కలు, ఆ ఫలవృక్షాలు వాటిపై వాలే రకరకాల పక్షులు, ఆ చల్లని గాలీ... అవన్నీ కూడా నాకు చాలా ఇష్టం మామయ్యా"

ఆమె మాట్లాడుతుంటే ఆయన కోడలివైపు అలా చూస్తుండిపోయారు ఇంకా చెప్పమన్నట్లు

చూసారు.

"అసలు మీరెప్పుడైనా ఆ తోటలు కాసేపు సేదతీరి ఆ అందాలను పరికించి చూసారా? ఆ మామిడి పూత, కోకిలమ్మ పాట ఎంత మనోహ రంగా ఉంటాయి. పూలపై వాలే రకరకాల రంగు రంగుల సీతాకోక చిలుకల్ని మనం మరెక్కడైనా చూడగలమా? అది మీకు చాలా చిన్న విష యంగా అన్పించవచ్చు. కానీ నాకు చాలా అద్భుత దృశ్యం మామయ్యా. కడియం నర్సరీ నుండి తెచ్చిన రకరకాల పూలమొక్కలతో బంగ్లా చుట్టూ ఎంత అందం కనువిందు చేస్తుందో ఒక సారి గమనించండి. ఇప్పుడది నాశనం చేసి



ప్లాట్స్‌గా మారుస్తానంటే నాకెందుకో చాలా బాధగా ఉంది మామయ్యా. మీ వ్యాపార విషయాల్లో కలుగజేసుకోకూడదు. కానీ నా మనసులో మాట చెప్పానంతే. మీకు కోపం వస్తే నన్ను క్షమించండి మామయ్యా'' అంది.

"ఉషా! నువ్వింత ప్రకృతి ప్రేమికురాలివని నాకిప్పుడే తెలిసిందమ్మా. ఏదో సరదాగా కాలక్షేపానికి వెళ్తున్నావని అనుకున్నాను. అయినా మూడు పంటలు పండే మంచి పొలాలే మంచి రేటు వుందని ప్లాట్సుగా మార్చేస్తున్నారు. నీలా ఎవరూ ఆలోచించరు తల్లీ'' అన్నారు.

"వాళ్లంతా అలా చేస్తున్నారని మనమూ అలా చేయాలా? మనం ఆ తోటని అలా ఉంచితే ముందు ముందు ఆ ఏరియాకి అదో గొప్ప నందన వనమవుతుంది. అప్పటికి దానివల్ల కూడా చాలా లాభాలుంటాయి.మనకి ఆనందం మిగులుతుంది. కూరగాయలకూ, పూలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందికదా. అవన్నీ మనమూ పండించవచ్చు. కొంచెం స్థలం గార్డెన్ పార్టీలకి వీలుగా తయారు చేయవచ్చు. చిన్న పార్కు ఓ వైపు వుంటే రోజూ చాలామంది వస్తారు. ఇప్పుడు జనాలకి సేద తీరడానికి స్థలమే కరువైపోయింది''... చెప్పుకుపోతోంది.

"సరే... నీ ఆలోచనలన్నీ బాగానే వున్నాయి. కానీ మాటలన్నీ పూర్తయిపోయాయి'' అంటూ మాట తుంచేసి చేయి కడుక్కుని రూమ్‌లోకి వెళ్లిపోయారాయన.

అప్పటివరకూ వాళ్ల సంభాషణ వింటున్న అత్తగారు కుర్చీలోంచి లేచి "ఉషా! నీకు చనువిచ్చి కూతురిలా చూసుకుంటే మామగారికే సలహా ఇస్తావా? ఆయన అన్నీ ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటారు. ఇదంతా మీ కోసమేకదా. ఇంకెప్పుడూ ఇలా కలుగ జేసుకోవద్దు'' అంది కాస్త కోపంగా.

తనేం తప్పు మాట్లాడిందో ఆమెకేం అర్థంకాలేదు. ఎంతసేపు సంపాదనే తప్ప మరే అనుభూతులు వీళ్లకి అక్కర్లేదు. మనసులో మాట చెప్పడం తప్పా? ఎంత చెప్పినా అర్థం చేసుకోరు అనుకుంది నిస్సహాయంగా.

★★★

వారంరోజులు గడిచాయి. ఇంట్లో ఎవ్వరూ ఆ విషయం మాట్లాడుకోలేదు.

కానీ ఉషలో మార్పును అందరూ గమనించారు. ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడే ఆమె ఇప్పుడు మౌనంగా ఉండడం ఎవరికీ నచ్చలేదు.

ఆ రోజు ఉష పుట్టినరోజు. ప్రతిసంవత్సరం ఆ తోటలో పనివాళ్లకి భోజనాలు పెట్టి ప్రకాష్ పిల్లలతో అక్కడే గడుపుతుంది.

కానీ ఇప్పుడు తన పుట్టినరోజనే విషయం మరచిపోయింది. ఇంట్లో వాళ్లూ మర్చిపోయారు.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని కాఫీ తాగుతుంటే ప్రకాష్ వచ్చి "హ్యాపీ బర్త్‌డే'' అన్నాడు. ఇంతలో మామగారు వచ్చి "ఈరోజు ఉష బర్త్‌డేకదా. ఏం గిఫ్ట్ ఇచ్చావురా'' అన్నారాయన కొడుకును ఉద్దేశించి.

"ఆయనే నాకు గొప్ప గిఫ్ట్ కదా మామయ్యా'' అంది ఉష.

'మంచి మాటన్నావు ఉషా. సరే సరే... ఇది నా గిఫ్ట్ తీసుకో అమ్మా'' అంటూ ఒక కవరు ఆమె చేతిలో వుంచారు.

ఆమె ఆశ్చర్యపోతూ కవర్ తెరిచింది. అవి ఫామ్‌హౌస్, తోట తాలూకు పేపర్లు. ఆశ్చర్యంగా మామగారి వంక చూసింది.

"ఇది కలకాదు నిజమే. నేను ఎన్ని వ్యాపారాలు చేసి సంపాదించినా మీకోసమే కదమ్మా. మీకు ఆనందం ఇవ్వలేని సంపద ఎందుకు చెప్పు. కూతురివైనా కోడలివైనా నువ్వేకదా. ఈ వారంరోజులు నువ్విలా ముభావంగా ఉండడం మాకెంతమాత్రం బాగాలేదు. అందుకే ఈ తోటను నీకోసం అమ్మకూడదని మీ అత్తయ్య, నేనూ అనుకున్నాం. ఇక ఈ తోటను ఎలా తీర్చిదిద్దుకుంటావో నీ ఇష్టం'' అన్నారాయన.

"ఔను ఉషా. ప్రకాశ్‌కి ఈ విషయం మొన్ననే చెప్పాం. కానీ నీ పుట్టిన రోజు కానుకగా ఇచ్చి సంతోషపరచాలని చెప్పలేదు'' అంది అత్తయ్య.

ఉష సంతోషం పట్టలేక "థాంక్స్ అత్తయ్యా...మామయ్యా..'' అంటూ వారి పాదాలకు నమస్కరించింది.

"నీ మౌన వ్రతంతో నాన్న మనసు మార్చేసావు'' అంటున్న భర్తవైపు సంతోషంగా చూసింది.

"సరే సరే ఇక బయలుదేరండి. ఈ రోజు ఏర్పాట్లన్నీ అక్కడే అరేంజ్ చేసేసాను. మీతోపాటు మీ అత్తయ్యా నేను కూడా...'' అంటుంటే ఆమె ముఖం మంచుతెరల మాటు నుండి వచ్చే ఉషోదయంలా వెలిగిపోయింది.

★



## క్రేజ్ కోసం పాట్లు..

'తషన్'లో టూపీస్ బికినీతో దర్శనమిచ్చిన కరీనాకపూర్ మరోసారి ఇలాంటి గెటప్‌తో కనిపించబోతోందిట. అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న 'కంభక్త్ ఇష్క్' అనే సినిమాలో కరీనా మళ్లీ బికినీతో అందాల విందు చేయబోతోందని బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. ఓ వైపు సైఫ్‌తో ఇదిగో పెళ్లి అదిగో పెళ్లి అంటూనే మరో వైపు ఇలా క్రేజ్ కోసం ఈ తాపత్రయం ఏమిటో కదా! అని ఆశ్చర్యపోతున్నారు సినీజనాలు.

